# గ్రూప్స్‌లో ప్రాథమిక వడపోత

- రద్దీని బట్టి ప్రిలిమ్స్, మెయిన్స్
- గ్రూపు-1లో గ్రూపు-2 పోస్టుల విలీన అమలు వాయిదా
- నిబంధన-7 తొలగింపునకూ సరే
- ఏపీపీఎస్సీ సంస్కరణలకు ముఖ్యమంత్రి అంగీకారం
- త్వరలో ఉత్తర్వుల విడుదల

ఈనాడు - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) తీసుకురాదలచిన సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించింది. ముఖ్యంగా దరఖాస్తుల రద్దీని అనుసరించి ప్రిలిమ్స్, మెయిన్స్ నిర్వహించేందుకు ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే గ్రూపు-1లో గ్రూపు-2 పోస్టుల విలీనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయడానికి అంగీకరించారు. ఈ మేరకు త్వరలో అధికారిక ఉత్తర్వులు రాబోతున్నాయి. ప్రస్తుతం గ్రూపు-1 పోస్టుల భర్తీకి ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో పరీక్షల్ని నిర్వహిస్తున్నారు. నియామకాల్లో పారదర్శకత పెంచేందుకు, పర్యవేక్షణ యంత్రాంగాన్ని పటిష్ఠం చేసే చర్యల్లో భాగంగా 30 వేల మందికి పైగా దరఖాస్తు చేసే ఉద్యోగాలకు ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో పరీక్షల్ని నిర్వహించేందుకు అనుమతినివ్వాలని ఏపీపీఎస్సీ ప్రభుత్వాన్ని కోరింది. దానివల్ల సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటామని ఏపీపీఎస్సీ ప్రతిపాదించింది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపినట్లు ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ నిర్ణయం ప్రకారం ఎక్కువ మంది అభ్యర్థులు దరఖాస్తు చేసే గ్రూపు-2



తరహా పరీక్షలకు ప్రిలిమ్స్, మెయిన్స్ తరహాలో పరీక్షలు జరిపేందుకు మార్గం సుగమమైంది. గ్రూపు-1లో గ్రూపు-2 పోస్టుల విలీన ఉత్తర్వుల అమలును త్వరలో జారీచేయబోయే నోటిఫికేషన్ల వరకు నిలుపుదల చేయాలని ఏపీపీఎస్సీ కోరగా దీనికీ సీఎం ఆమోదం తెలిపారు. అలాగే...జారీచేసిన నోటిఫికేషన్ అనుసరించి అభ్యర్థులు రాకుండా ఉంటే మిగిలిన పోస్టుల భర్తీని తర్వాత నోటిఫికేషన్ ద్వారా చేపట్టాలని ఏపీపీఎస్సీ నియమావళిలోని నిబంధన-6, ప్రాధాన్య క్రమంలో తర్వాత వరుసలో ఉన్న వారితో భర్తీచేయాలని నిబంధన-7 చెబుతోంది. ఇకపై నిబంధన-7ను రద్దుచేసి, నిబంధన-6 ప్రకారమే పోస్టుల భర్తీని చేపడతామని, ఆ మేరకు ఆమోదం తెలపాలని ఏపీపీఎస్సీ కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు.

## ముందుకొచ్చే వారిని బట్టి స్పష్టత

సుప్రీంకోర్టు ఆదేశాల్ని అనుసరించి 2003 గ్రూపు-1 నోటిఫికేషన్ ప్రకారం అదనంగా 67 పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఏపీపీఎస్సీ ప్రకటించి వారి సమ్మతిని కోరింది. ఇందులో 36 పోస్టులు ఏపీకి చెందినవి ఉన్నాయి. ఈ 36 పోస్టుల్లో చేరేందుకు ఎంతమంది ముందుకొస్తారోనన్న దానిపై త్వరలో స్పష్టత రానుంది. ఈ పోస్టుల సంఖ్యను అనుసరించి 2011 గ్రూపు-1 పోస్టుల సంఖ్య ఖరారు కానుంది. ప్రస్తుత సమాచారం ప్రకారం 2011 నోటిఫికేషన్ ప్రకారం ఏపీకి 173 పోస్టులు (మిగతా 2లో)

- 30 వేల మందికి పైగా దరఖాస్తు చేసే ఉద్యోగాలకు ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో పరీక్షల్ని నిర్వహించేందుకు అనుమతినివ్వాలని ఏపీపీఎస్సీ కోరగా ముఖ్యమంత్రి అంగీకరించారు.
- జారీచేసిన నోటిఫికేషన్ అనుసరించి అభ్యర్థులు రాకుండా ఉంటే మిగిలిన పోస్టుల భర్తీని తర్వాత నోటిఫికేషన్ ద్వారా చేపట్టాలని ఏపీపీఎస్సీ కోరగా ఆమోదం లభించింది.

# గ్రూప్స్‌లో ప్రాథమిక వడపోత

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయి. వీటిలోనే 2003 నోటిఫికేషన్‌కు చెందిన 36 పోస్టులు ఉన్నాయి. 2003 నోటిఫికేషన్ ద్వారా మిగిలిన పోస్టుల్ని వీటిల్లో కలిపారు. ఈ 36 పోస్టుల్లో చేరేందుకు ఎంతమంది వస్తారో నిర్ధారించుకున్న అనంతరమే 2011 గ్రూపు-1 కింద ఎన్ని పోస్టులు ఉంటాయోనన్న దానిపై స్పష్టత వస్తుంది. దీని ప్రకారమే 2011 గ్రూపు-1 పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షల్ని నిర్వహిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మెయిన్స్ కింద జరిగిన వాటిల్లో ఒక దానికి గైర్హాజరైనా సెప్టెంబరులో జరిగే పరీక్షల్ని రాసేందుకు అనుమతినివ్వబోమని ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్ స్పష్టం చేశారు.